శ్రీసత్యసాయి జయంతి వేడుకలు

శివంలోని శ్రీసత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, నవంబర్ 17 : శివంలో శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణసేవ(అన్నదానం) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్‌తో పాటు శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా సురేశ్‌బాబు

కాచిగూడ, నవంబర్ 17: కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా 2007 బ్యాచ్‌కు చెందిన సీహెచ్.సురేశ్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని సీఐడీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసిన సురేశ్‌బాబు నగర కమిషనర్ సి.వి.ఆనంద్ ఉత్తర్వులు జారీచేయడంతో కాచిగూడ పీఎస్ డీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఐ సురేశ్‌బాబు మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏలాంటి దొంగతనాలు, స్నాచింగ్ లాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వివిధ కేసుల్లో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు త్వరితగతిన న్యాయం చేస్తానని పేర్కొన్నారు. పీఎస్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విధులు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

సజావుగా గ్రూప్-3 పరీక్ష

పరీక్ష రాసిన వారికంటే గైర్హాజరైన అభ్యర్థులే అధికం

సుల్తాన్‌బజార్, నవంబర్ 17 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు సజావుగా ప్రారంభ మయ్యాయి. ఈ మేరకు కోఠి జాంబాగ్‌లోని వీవీ కళాశాలలో, ప్రగతి మహా విద్యాలయంలో నిర్వహించిన రెండు పరీక్షా కేంద్రాలలో గ్రూప్-3 పరీక్ష రాసేందుకు అభ్యర్థులు కేటాయించిన సమయంలోపే రావడం కనిపించింది. ఈ సందర్భంగా సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి నేతృత్వంలో ఎస్ఐలు మధుసూదనాచారి, అంకం నరేశ్‌లు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా కోఠి జాంబాగ్‌లోని వీవీ కళాశాలలో రెండు సెషన్‌లకు గాను 274 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా 710 మంది గైర్హాజరయ్యారు. ప్రగతి మహా విద్యాలయంలో 410 మంది పరీక్ష రాయగా 358 మంది గైర్హాజరయ్యారు.

నేటి నుంచి బొడ్రాయి పునఃప్రతిష్ఠ ఉత్సవాలు

పాత బొడ్రాయికి పూజలు నిర్వహిస్తున్న దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు

పాత బొడ్రాయిని భూమిలో నిక్షిప్తం చేస్తున్న సమితి ప్రతినిధులు

ప్రతిష్ఠ చేయనున్న కొత్తగా రూపొందించిన బొడ్రాయి

అంబర్‌పేట, నవంబర్ 17 : అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో అంబర్‌పేట బొడ్రాయి (నాభిశిల) పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు సమితి ప్రతినిధులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఒక్కో రోజు ఒక్కో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం అంబర్‌పేట మెయిన్‌రోడ్డులో గల పాత బొడ్రాయిని తొలగించి గాంధీ బొమ్మ ఎదురుగా కొత్త బొడ్రాయిని ప్రతిష్ఠించే స్థలంలో పూజా కార్యక్రమాల మధ్య నిక్షిప్తం చేశారు. ఈ నెల 18వ తేదీ సోమవారం ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యహవాచనం, దీక్షాధారణ, రక్షాబంధనం, యాగశాల పుణీతం, అఖండ దీపారాధన, అంకురార్పణ, వాస్తు, చతుషష్టి నవగ్రహ క్షేత్రపాలక మండపరాధనలు, ప్రధాన కలశస్థాపన, సాయంత్రం నాలుగు గంటలకు అగ్నిప్రతిష్ఠ, గణపతి, నవగ్రహ, రుద్ర సహిత స్థాపిత మండపదేవత హవనములు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది.

19వ తేదీ మంగళవారం ఉదయం స్థాపిత దేవతా మూలమంత్ర హవనములు, మంత్ర పుష్పం, హారతి తదితర పూజలు నిర్వహిస్తున్నారు. 20వ తేదీ బుధవారం ఆరున్నర నుంచి స్థాపిత దేవతా మూల మంత్ర హవనములు, మండప ఆవాహిత దేవతా హవనములు, మహాస్వపనం, జలాధివాసం, ధాన్యాదివాస హోమములు, తొమ్మిది యాభైనాలుగు నిమిషాలకు శీతలదేవి యంత్ర ప్రతిష్ఠ, బొడ్రాయి(నిభిశిల) ప్రతిష్ఠ, పూర్ణాహుతి, హారతి, మంత్రపుష్పం, కలశ ఉద్వాసన, అవబృదస్నాం, తీర్థప్రసాదములు ఉంటాయి. అలాగే 20వ తేదీ మధ్యాహ్నం నుంచి బైండ్ల(భవనీయ)వారి పూజలు మొదలవుతాయని సమితి ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా చంద్రపటం, నవధాన్యాలతో రాసిపోయడం, 12 అఖండ జ్యోతులు వెలిగించుట, రాత్రి బొడ్రాయి కథ కార్యక్రమం, రాత్రి 7.25 నిమిషాలకు అంబర్‌పేట పొలిమేర చుట్టు పొత్తిపోయడం జరుగుతుందని చెప్పారు. అలాగే అర్ధరాత్రి తర్వాత దిష్టికుంభం, అఖండ జ్యోతులు వెలిగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన గురువారం తెల్లవారు జామున పలిమేర చుట్టు బలి కార్యక్రమం, ఉదయం 6 గంటలకు పోతరాజు వేశాధారణతో గావు పట్టడం, 9 గంటలకు తీర్థప్రసాదాలు ఉంటాయన్నారు.

అంబర్‌పేట బొడ్రాయి చరిత్ర...

భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంలా శతాబ్దాల కాలంగా పూజలందుకుంటూ విరాజిల్లుతున్న అంబర్‌పేట బొడ్రాయి ఛే నంబర్ నుంచి రామాంతపూర్ వెళ్లే జాతీయ రహదారిలోని గాంధీ బొమ్మ ఎదురుగా ఉంది. ఈ బొడ్రాయిని స్థానిక ప్రజలు ఇప్పటికీ భక్తిశ్రద్ధలతో కొలుస్తుంటారు. శతాబ్దాల క్రితం ఏర్పడిన ఈ గ్రామం మధ్యలోని బొడ్రాయి నాలుగైదు అడుగుల నీటిలో వెలిసింది. పూర్వీకులు ఈ నీటిలోకి దిగి పూజలు నిర్వహించేవారు. ఇది కాస్త ప్రజలకు ఇబ్బందికరంగా మారడంతో ఆనాటి గ్రామ పెద్దలు నీటి భాగం నుంచి బొడ్రాయిని పైకి తీసి, దానికొక స్థిరమైన ఆకారం ఏర్పరచారు. జాతీయ రహదారి కావడంతో పదే పదే రోడ్డు వేయడంతో ఈ బొడ్రాయి కాస్త మరింత దిగువకు చేరింది. దీనికి తోడు ఇటీవల ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం కూడా జరుగుతుంది. దీని కారణంగా బొడ్రాయి మధ్యలోకి చేరడం, దీనిపై నుంచి ఫ్లైఓవర్ నిర్మాణం జరిగింది. శాస్త్ర ప్రకారం బొడ్రాయి పై సూర్య కిరణాలు పడాలి. వర్షం కురవాలి. ఇందుకు భిన్నంగా ఈ బొడ్రాయి పరిస్థితి మారడంతో దీన్ని పునఃనిర్మాణం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ మేరకు అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి నిర్ణయం ప్రకారం ఇప్పుడున్న బొడ్రాయికి వెలుతురు సోకే బహిరంగ ప్రదేశానికి మార్చడం జరుగుతున్నది. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు బొడ్రాయి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

మహాదేవ్ ఆలయంలో అన్నదానం

నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ఉన్న మహాదేవ్ ఆలయంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కైలాశ్ కేడియా, మణిలాల్ షా, అశోక్‌గుప్తా, గోవింద్ అగర్వాల్, ఉత్తమ్ కుమార్, బల్లు, సునీతగుప్తా, సుశీల్‌మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

– ఆబిడ్, నవంబర్ 17

సన్మానం

మహారాష్ట్ర పండరిపూర్, షోలాపూర్‌ల రైతులకు కంది పంటకు గిట్టుబాటు ధర ఇచ్చినందకు గుడిమల్కాపూర్ మార్కెట్ 35వ నంబర్ కమిషన్ ఏజెంట్ సంఘం నగేశ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు చీలంపల్లి సురేశ్, భీం శ్రీకాంత్, హమాలి సంఘం నాయకులు ఆశోక్‌లు పాల్గొన్నారు.

– ఆబిడ్స్, నవంబర్ 17

గో సంరక్షణకు రోజుకో రూపాయి పొదుపు చేయాలి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాద పూర్వకంగా కలిసి గో మాత విగ్రహాన్ని అందించి సత్కరిస్తున్న లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, మేనేజింగ్ ట్రస్టీ రిథేష్ జాగిర్దార్ తదితరులు

సుల్తాన్‌బజార్, నవంబర్ 17 : గో వుల సంరక్షణ కోసం ప్రతి రోజూ ఒక్క రూపాయి ఆదా చేసేందుకు లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ఎంతో ఉత్సాహంగా ప్రచారం చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, ట్రస్టీ రిథేశ్ జాగిర్దార్ అన్నారు. ఆదివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను వారు పలు గో సంఘాల ప్రతినిధులతో మర్యాద పూర్వకంగా కలిసి గోమాత విగ్రహాన్ని, లవ్ ఫర్ కౌ జ్ఞాపికను అంద జేసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిత్యం ఒక్క రూపాయిని పొదుపు చేస్తే నెల 30 రూపాయలు,సంవత్సరానికి 365 రూపా యలు వస్తుందని అన్నారు. ఈ డబ్బును పొదుపు చేయడం ద్వారా గోమాత సేవలకు సహకరించవచ్చని, భవిష్యత్ తరాలకు గో మాతలను సంరక్షించే విషయాలను వారు గవర్నర్‌కు వివరించారు.అంతే కాకుండా సికింద్రాబాద్, హైదరాబాద్ జంట నగరాల పరిసర ప్రాంతాలలోని గోశాలను సందర్శించాలని వారు గవర్నర్‌ను కోరారు. గడ్డి, మేత, మందులు తదితర అంశాల కోసం గోశాలలకు నిధులు సమకూర్చడంలో సహాయం అందించాలని వారు గవర్నర్‌ను కోరారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన గవర్నర్ మాట్లాడుతూ.. జంతు సంక్షేమ సంఘాలు, గో సేవా సంఘాలు చేస్తున్న కార్యక్రమాలు అత్యద్భుతమని అన్నారు. ప్రస్తుతం గో మాతలకు చేస్తున్న సేవలు మరింత చేయాలని ఆయన కోరారు. త్వరలోనే సంఘాల కోరిక మేరకు గోశాలలను సందర్శిస్తానని అన్నారు. గోశాలలకు తన వంతు సహాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ ప్రాణి మిత్ర సంఘం అధ్యక్షుడు జస్రాజ్ శ్రీశ్రీమల్, గో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీమనోహర్ పాలోడ్ పాల్గొన్నారు.

లంగర్‌హౌస్‌లో బీజేపీ మూసీ.. బస్తీ నిద్ర

బాపూనగర్ మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

మెహిదీపట్నం, నవంబర్ 17 : సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తూ బీజేపీ నాయకులు కార్పొరేటర్ నియోజకవర్గంలో మూసీ పరీవాహక ప్రాంతంలో బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. లంగర్‌హౌస్ బాపూనగర్‌లో బీజేపీ కార్యకర్త రాహుల్‌శర్మ ఇంట్లో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు శనివారం రాత్రి నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం మూసీ పరీవాహక ప్రాంతంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. తమను సీఎం రేవంత్‌రెడ్డి ఇండ్లు వదిలివెళ్లేలా చేయాలనుకోవడం ఎంత వరకు సమంజసమని వాపోయారు. ధర్మారావు మాట్లాడుతూ.. ప్రజలకు అన్యాయం జరుగుకుండా బీజేపీ అండగా ఉంటుందని అన్నారు. మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, వినేష్ సింగ్, నాగేంద్ర ప్రకాశ్‌రెడ్డి, ఆమంచి శ్రీకాంత్, భానుప్రకాశ్, రాహుల్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలి

నేటి బాలలే రేపటి పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని నింబోలిఅడ్డా ప్రభుత్వ బాలికల సదనం సూపరింటెండెంట్ ఎన్. మైథిలీ అన్నారు. బాలల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నాల్గొవ రోజు శనివారం కాచిగూడలోని నింబోలిఅడ్డా జూవైనల్ హోంలో బాలల దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు దుసులు పంపిణీ చేశారు. అనంతరం మైథిలీ మాట్లాడుతూ.. పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధచుపాలని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన 'చెల్డ్ రైట్స్ కన్వెన్షన్' వీక్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

– కాచిగూడ, నవంబర్ 17

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో బాల్‌ఠాక్రే వర్ధంతి

హిందూ సామ్రాట్ బాల్‌ఠాక్రే చూపించిన బాటలో నేటి యువత పయనించాలని శివసేన తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్ అన్నారు. బాల్‌ఠాక్రే 12వ వర్ధంతిని ఆదివారం కాచిగూడ రైల్వేస్టేషన్ కంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించి, చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్, సత్తయ్య, శ్రీకాంత్, బాలయ్య, నర్సింహ, ఉపేందర్, రమేశ్, వీరయ్య, గోపాల్, శ్రీనివాస్, దిలీప్, కాచిగూడ రైల్వేస్టేషన్ కార్మికులు పాల్గొన్నారు.

– కాచిగూడ, నవంబర్ 17

ట్రంకు పెట్టెలు సిద్ధం

జూబ్లీహిల్స్, నవంబర్17: సమగ్ర కుటంబ సర్వే దరఖాస్తులను భద్రపరిచేందుకు ట్రంకు పెట్టెలు సిద్ధమయ్యాయి. గతంలో ప్రజా పాలన దరఖాస్తులను కూడా ట్రంకు పెట్టెల్లో తరలించి 6 గ్యారెంటీలను అటకెక్కించిన విషయం తెలిసిందే. అసలు సర్వే ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదన్న అయోమయంలో ప్రజలుండగా మళ్లీ ప్రజల భవిష్యత్‌ను ట్రంకు పెట్టెల్లో పెట్టి తాళం వేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్న నేపథ్యంలో దరఖాస్తులను తరలించేందుకు కొత్తసీసాలో పాత సారా చందంగా కొత్త ట్రంకు పెట్టెలను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ కార్యాలయానికి ట్రంకు పెట్టెలు చేరుకున్నాయి.

తొలి సీఎం కేసీఆర్‌ను ప్రజల హృదయాల నుంచి తొలగించడం అసాధ్యం

● ఉపేంద్ర, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు

సుల్తాన్‌బజార్, నవంబర్ 17: అమరుల త్యాగాలతో పాటు ఎంతో మంది పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అనేక రంగాలలో నంబర్ వన్‌గా నిలిపిన ఘనత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకే దక్కుతుందని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం, అమరవీరుల దీపం, అంబేద్కర్ విగ్రహాల వద్ద సరైన విద్యుత్తును సరఫరా చేయాలని లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణ వ్యతిరేక ప్రభుత్వంగా ప్రకటించాల్సి వస్తుందని ఆయన అన్నారు. గడిచిన పది సంవత్సరాలలో రాష్ట్రంలో తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా పాలించారని అన్నారు. సచివాలయాన్ని ఎంతో అత్యద్భుతంగా నిర్మించి అనతి కాలంలోనే నగరానికి వన్నె తెచ్చిన ఈ కట్టడాన్ని విదేశీయులు సైతం మెచ్చుకున్నారని తెలిపారు. సచివాలయానికి గతంలో మాదిరిగా కాకుండా ఈ మధ్యకాలంలో విద్యుత్తు సరఫరాను తక్కువ చేయడంతో లైటింగ్ తగ్గడంతో టూరిస్టులు, ప్రజలకు ఫొటోలు తీసుకునేందుకు ఇబ్బందిగా మారిందని అన్నారు. విద్యుత్తును తక్కువ చేస్తున్న ఈ ప్రభుత్వ మూర్ఖపు విధానాలను త్వరలోనే ప్రజలు తెలుసు కుంటారని చెప్పారు. అంతేకాకుండా 1200 మంది అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకునేందుకు నిర్మించిన అమ రవీరుల జ్యోతి వద్ద, దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యుత్తు సరఫరాను తక్కువ చేయడం విచారకరమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటలు విద్యుత్ అందిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రి కూడా సరిపడా విద్యుత్తు ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే విద్యుత్తును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

సత్యం శివం సుందరం గోశాలలో.. అన్నకూట్ మహోత్సవాలు

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద, ఉత్తమంగా నిర్వహించబడుతున్న గగన్‌పహాడ్‌లోని సత్యం శివం సుందరం గోశాలలో ఆదివారం మహా అన్నకూట్ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. వేలాది మంది జంతు ప్రేమికులు, భక్తులు రోజంతా ఈ వేడుకల్లో పాల్గొని పశువులకు గ్రాసం తినిపించారు. అన్నకూట్ సాహిత్యపరమైన అర్థం ఆహార పూజ, ఇది దేవునికి ఆహారం నైవేద్యాన్ని సమర్పించడం, దానిని తయారు చేయడంలో ఉన్న ప్రేమ, భక్తిని సూచిస్తుంది. పండిత్ హరిశ్చంద్రజీ కులకర్ణి మహాలక్ష్మి పంచకుండియ మహాయజ్ఞం నిర్వహించారు. అనిరుద్ధీ మధురమైన భజనలు ఆలపించారు.

– మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 17

నిరుద్యోగులకు వరంగా గ్రంథాలయాలు

● ఎస్ఆర్‌నగర్ గ్రంథపాలకుడు హరిబాబు

● అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ చొరవే కారణం



ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సన్మానిస్తున్న ఎస్ఆర్ నగర్ గ్రంథపాలకుడు హరిబాబు

అమీర్‌పేట్,నవంబర్ 17: దశాబ్ద కాలంలో ఆధునీకరించబడిన గ్రంథాలయాలు నిరుద్యోగులకు వరంగా మారాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్న నిరుద్యోగుల డిమాండ్ మేరకు అప్పటి బీఆర్ఎస్ సర్కార్ అనుకూల నిర్ణయం తీసుకున్నది. దీంతో దశాబ్ద కాలంలో గ్రంథాలయాలకు పాఠకుల సంఖ్య పెరగడం, అంతకంతకూ సదుపాయాలు కూడా మెరుగుపడడంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు నిరుద్యోగులు రోజుకు కనీసం 8 గంటల పాటు లైబ్రరీల్లోనే గడిపే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఇటువంటి సదుపాయాలే ఎస్ఆర్‌నగర్‌లో కూడా ఉన్నాయి.

ఎస్ఆర్‌నగర్ గ్రంథపాలకుడు హరిబాబు చొరవతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అందుబాటులో ఉండేలా సుమారు 1200 పోటీ పరీక్షలకు ఉయోగపడే పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. ఎస్ఆర్‌నగర్ జలమండలి కార్యాలయం సమీపంలోని విశాలమైన పార్కులో ఉన్న ఈ గ్రంథాలయం నిరుద్యోగులకు వ్యక్తిగత, గ్రూప్ స్టడీకి అనువైన వాతావరణం కల్పిస్తున్నది. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 జూలైలో గ్రూప్-4 నోటిఫికేషన్ ఇవ్వడంతో.. తెలంగాణ నలుమూలల నుంచి నగరానికి వచ్చిన ఎందరో నిరుద్యోగులు ఎస్ఆర్‌నగర్ గ్రంథాలయాన్ని తమ చదువులకు వేదికగా ఎంచుకొని విజయం సాధించారు. నవంబర్ 14న వెలువడిన ఫలితాల్లో పలువురు ఉద్యోగాలు పొందారు. వీరిలో ఓయూలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందిన శేఖర్, మహబూబాబాద్, సిద్ధిపేట, సూర్యాపేట పురపాలక కార్యాలయాల్లో వార్డు ఆఫీసర్లుగా పృథ్వీ, శివ, వంశీకృష్ణారెడ్డి, జూనియర్ ఆడిటర్‌గా శివకుమార్ ఎంపికయ్యారు. శనివారం గ్రంథాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో గ్రంథపాలకుడు హరిబాబు వారిని ఘనంగా సన్మానించారు.

ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు-2024కు మహేశ్‌కుమార్‌గౌడ్ ఎంపిక

సుల్తాన్‌బజార్,నవంబర్ 17 : ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు-2024కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అ ధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్‌ముదిరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో ఎనలేని కృషి చేయడంతో పాటు జాతీయ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడుగా, యువజన కాంగ్రెస్ పార్టీ ఐఖ్యతకు, అభివృద్ధికి చేసిన కృషిని గుర్తిస్తూ ఈ అవార్డును ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కార్యకర్త స్థాయి నుండి టీపీసీసీ అధ్యక్షుడుగా, ఎమ్మెల్సీగా ఎదగడం బీసీ వర్గానికి గర్వకారణమని అన్నారు. జాతీయ సమైఖ్యత, మతసామరస్యం, శాంతి స్థాపనకై ప్రజ లలో ఎన్నో చైతన్య కార్యక్రమాలను చేపట్టి అందరినీ ఒకే తాటిపైకి నడిపిస్తూ ముందుకు సాగుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం ఇందిరా గాంధీ నార్సింగిలోని తన నివాసంలో ఇందిరాగాంధీ ఎక్స్‌లెన్స్ అవార్డును అందించి సన్మానించడం జరుగుతుందని అన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంపులో ఉపాధ్యాయుల పాత్ర కీలం

విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు ప్రొఫెసర్లు పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్(ఎఫ్‌డీపీ) ఆదివారం ముగిసింది. ఉస్మానియా యునిర్సిటీ ప్రొఫెసర్ జయవెంకటేశ్వర్ మాట్లాడుతూ.. టీచింగ్ మెథడాలజీలో ఆధునిక పద్ధతులను వివరించారు. ప్రొఫెసర్ ఫ్యాట్రిక్ మాక్స్ మాస్, భవన్స్ కళాశాల కామర్స్ విభాగాధిపతి ఎల్ఎస్ కమల మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ఓయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ఇంద్రకంటి శంకర్, కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

– చిక్కడపల్లి, నవంబర్ 17

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, నవంబర్ 17 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ ఎల్ఐసీ కాలనీ ఫీడర్,11 కేవీ మురాద్‌నగర్ ఫీడర్,11 కేవీ గొల్లబస్తీ ఫీడర్,11 కేవీ ఎ-1 హోటల్ ఫీడర్ ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు..

మురాద్‌నగర్, చోటీ మసీద్, పటేల్ డెయిరీ ఫాం ఏరియా, రాయల్ సీ హోటల్, ఎల్ఐసీ కార్యాలయం, హిల్ కాలనీ, మురాద్‌నగర్, ఎంపీ గార్డెన్ ఫంక్షన్‌హాల్

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

గుడిమల్కాపూర్, వీబీజీ గార్డెన్, నవోదయ కాలనీ, సాబేర్‌నగర్, గొల్లబస్తీ, ఉషోదయ కాలనీ, మందుల గూడ, ప్రియా కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు